

# పసిడిమనసులు - షర్మిల



## స్పై "లబ్ డబ్ "

కాలేజీలో చేరేటప్పటికి 14 నిండి 15 వ ఏట అడుగుపెట్టాను. కానీ ఎప్పుడూ ఒక ఏడాది ఎక్కువే చెప్పేదాన్ని. ఎందుకంటే అసలు ఏజ్ చెప్తే నమ్మేవారు కాదు.ఎందుకొచ్చిన గోల అని ఒకేడు ఎక్కువే చెప్పేదాన్ని.

అప్పటికే పదహారేళ్ళవయసు సినిమా చూశానేమో శ్రీదేవిలా ఫీలయ్యేదాన్ని. పనిలో పనిగా రంగు రంగుల పూలగొడుగు ఒకటి కొన్నాను. లంగా వోణీలు కూడా ఇప్పుడు వేసుకోవటం మొదలెట్టాను.

ఈ కాలేజీలో చేరినప్పుడు అందరు ఆడపిల్లల్ని ఏడిపించినట్టు నన్నూ ఏడిపించబోయారు. మా బావ అప్పట్లో ఎందుకో మా ఇంటి దగ్గరే వున్నాడు. మా నాన్న కి బుల్లెట్ మోటారు సైకిల్ వుండేది. అదేసుకుని ఒక రోజు వచ్చాడు.

"మా మరదల్ని ఏడిపించే వాళ్ళెవరో రండి. రేపే మా లారీ కడప నుంచి వస్తోంది. మీ సంగతి చూస్తాం జాగ్రత్త" అని చెప్పి వెళ్ళాడు.

నిజంగానే మా బాబాయ్, నాన్న కడప దగ్గర ఎర్రగుంట్ల లో క్రషర్ పెట్టారు.

అక్కడికి వెళ్ళిన మా లారీ ఇక్కడికి అక్కడ తీసేసిన క్రషర్ సామాను వేసుకుని వస్తోంది.

ఏదో బెదిరించడానికి ఆ సమయానికి తనకి అది గుర్తొచ్చింది. పైగా మా నాన్న మాజీ సైనికుడని తెలుసు.

ఆయన పర్సనాలిటీ, బుల్లెట్ చూసి ఆయన దగ్గర తుపాకీ కూడా వుందన్న పుకారు కూడా ప్రచారంలో వుండటంతో నా జోలికి ఎవరూ వచ్చేవారు కాదు.

కానీ అజ్ఞాత ఆరాధకులు మాత్రం ఎక్కువయ్యారు. కాలేజీ అయిపోయాక నేను ఇంటికి వచ్చేటప్పుడు ఆ ఆరాధకులు మాత్రం తన్నులు తింటామన్న భయం కూడా లేకుండా నా వెనకాలే వచ్చేవారు.

వాళ్ళు నలుగురూ పాపం ఏ కామెంట్లు చెయ్యకుండా బుద్ధిగా వచ్చి మా ఇల్లు అంత దూరాన వుండగా వెనక్కి వెళ్ళిపోయేవారు.

వాళ్ళు ఏమీ ప్రమాదమైన మనుషులు కాదని కొన్నాళ్ళకి అర్ధమైంది.

కానీ  ఎప్పుడూ మాట్లాడేదాన్ని కాదు .

ఒక్కసారి మాత్రం " మీరు నా వెనక ఎందుకు వస్తున్నారు ?" అని అడిగితే " ఈ రోడ్డు మీ ఒక్కరిదీ కాదు కదండీ ? "అన్నాడు గుండు. వాడికి నేను పెట్టిన పేరు అది.

కాలేజీలో చేరిన కొత్తలో గుండుతో వచ్చేవాడు. తరవాత జుట్టు పెంచినా గుండుగానే మిగిలిపోయాడు.

ఈ నలుగురిలో పెద్దవాడు గున్నా,  చిన్నాడు పాల్. తరవాత కొన్నాళ్ళకి ఇంకాస్త స్నేహితులయ్యారు. వాళ్ళు నా సైన్స్ రికార్డులు అందంగా రాసి బొమ్మలేసి ఇవ్వడం .

కెమిస్ట్రీ లాబ్ లో సహాయం చేయడం చేసేవరకూ వచ్చారు. వాళ్ళకు నేనా అవకాశం ఇవ్వడమే వాళ్ళ అదృష్టమన్నట్టుగా ఏ పని చెప్పినా చిటికెలో చేసేసేవారు .

నేను ఎలక్షన్లలో నించున్నప్పుడు నా అసలు ఫ్రెండ్స్ సత్యనారాయణ, సురేష్ , సూర్యకుమారి, నాగలక్ష్మి, రమణమ్మలు. నాతో పాటే వుండేవారు. కానీ నా అనుచరులుగా మాత్రం ఈ గుండు బ్యాచ్ వుండేది.

అసలు చిన్నప్పటి నుంచి ఆడపిల్లలు నాకు దూరంగానే వుండే వారు. వాళ్ళలా అచ్చంగాయలు, చింతపిక్కలు ఆడడం రాదు .

పోనీ చుక్కల ముగ్గులు వేయడమన్నా వచ్చా అంటే అవంటే నాకు లెక్కల కన్నా భయం. పూలు మాల కట్టడం రాదు. ఇవన్నీ రాని నాతో ఏ ఆడపిల్ల మాత్రం స్నేహం చేస్తుంది .

పోనీ కాలేజీకి వచ్చాకయినా తలొంచుకుని మొగ పిల్లల కామెంట్సుకు సిగ్గుపడుతూ క్లాసుల్లో మీటింగులు పెట్టుకుని " వాడు అలా అన్నాడే ... వీడు ఇలా అన్నాడే వెధవ !"అని అబ్బాయిల కబుర్లు చెప్పుకునే బ్యాచ్ అంటే నాకు అసలే మంట.

దీనితో ఆడ స్నేహితులు అరకొరగానే వుండేవారు.

ఈలోగా స్కై లాబ్ గోల ఒకటి మొదలయ్యింది.

ఆకాశం నుంచి స్కైలాబ్ ఎక్కడయినా పడవచ్చని పేపర్లలో వార్తలు తెగ వచ్చాయి. మొత్తం దేశంలో జనం అప్పులు చేసి మరీ విందులు చేసుకున్నారు .

ఎలాగూ అది నెత్తిన పడితే చస్తామని ఈ లోగా ఇష్టమైనవన్నీ తినెయ్యాలని కొందరు కోళ్ళని కోసుకుని గారెలు వండుకుని తినేశారు.

ఈ గోల జరుగుతుండగా కాలేజీకి సెలవులు. మా ఇల్లు వూరికి దూరంగా పొలాల్లో వుండేది. మా బ్రిక్ ఇండస్ట్రీ దగ్గరే అందులో పనిచేసే వాళ్ళ ఇళ్ళు మా ఇల్లు తప్ప వేరే ఏమీ వుండవు.

ఒక రోజు పొద్దున్న నేను వసారా కూర్చుని పేపర్ చదువుతూ బయటకి చూశాను. మా గుండు బ్యాచ్ తచ్చాడుతూ కనిపించారు .

"అమ్మా! మా కాలేజీ వాళ్ళు వచ్చారు ... ఏంటో మాట్లాడి వస్తానని " వాళ్ళ దగ్గరికి వెళ్ళాను.

" ఏంటి అందరూ ఇటొచ్చారు ?" అని అడిగాను.

" పేపర్ చూశారా ! ఇవ్వాళే స్కైలాబ్ పడుతుందంట !" అన్నాడు గుండు.

"అయితే " అన్నాను .

" స్కై లాబ్ ఎక్కడ పడతందో తెలియదుకదా !ఒకేళ అది ఇక్కడ పడితే ఇక్కడే చచ్చి పోదామని " ... నసిగాడు గుండు.

మిగతా వాళ్ళు తలలూపారు.

ఇక నేనేం చెప్పానో వాళ్ళెప్పుడు వెళ్ళారో నాకు తెలియదు.

వారికి అవే చివరి క్షణాలయితే ఆ క్షణాలు నాతో అంతమవ్వాలన్న వారి కోరిక విన్నాకా ఏం మాటలుంటాయ్ !

అమలిన ప్రేమకు ఉదాహరణగా కొందరు మిగిలిపోతారంతే !

*(వచ్చేనెల మరో కథ)*

Post your comments